# మోడర్న్ పెళ్ళికూతురు

గురజాడ శోభాపేరిందేవి

"నాన్నా నేనీ పెళ్ళిచేసుకోను"

తాంబూలాలు పుచ్చుకోడానికి మరి కాస్సేపటిలో పెళ్ళివారొస్తున్నారు అన్న హడావిడిలో అన్నీ సిద్ధంగా ఉన్నాయో లేదో అని లిస్టు కాగితం పట్టుకుని కొన్న సరుకులను చూసుకుంటున్న రావు కూతురి ముఖం వైపుకు చూశాడు.

శ్రీల తండ్రి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అంది "నాకీ పెళ్ళి ఇష్టం లేదు నాన్నా!"

"ఎందుకిష్టం లేదే?! అబ్బాయి హీరోలా ఉన్నాడు. బ్యాంక్‌లో ఆఫీసర్‌గా చేస్తున్నాడు."

"అయినా నాకిష్టం లేదు నాన్నా!"

"అదే ఎందుకు అని అడుగుతున్నాను?"

"........."

"నిన్నే జవాబు చెప్పు!"

"..........."

"కొంపదీసి ఎవరినైనా ప్రేమించావా?"

"............"

"ఏ మాటా చెప్పకపోతే నాకెలా తెలుస్తుందే?"

"............."

"అవును కాదో చెప్పు"

శ్రీల తండ్రి ముఖంలోకి చూస్తూ "అవును" అంది.



ఆశ్చర్యపోయాడు రావు.

"ఎవర్ని ప్రేమించావే?" గట్టిగా అరిచాడు రావు.

అప్పటిదాకా జరుగుతున్న సంభాషణని వింటూ గుమ్మం దగ్గర నిలబడిన శ్రీల తల్లి గబగబా భర్త దగ్గరకి వచ్చింది.

"అది ఎవర్ని ప్రేమించింది అని అడుగుతారేంటి అది అప్రస్తుతం! మనం కుదిర్చిన సంబంధాన్నే ఇది చేసుకుతీరాలని గట్టిగ గడ్డిపెట్టండి." "ఏమే నీకు బుద్ధుందా లేదా? మీ నాన్నగారి పరువు ప్రతిష్ఠలను బజార్న పడేయాలని చూస్తున్నావా? పీటలదాకా వస్తున్న పెళ్ళి సంబంధాన్ని ఆపేస్తే ఎంత సిగ్గుచేటు! నోరు మూసుకుని పెళ్ళి చేసుకో!" అంది కోపంగా!

"అమ్మా నోరు మూసుకుని పెళ్ళి చేసుకో! కుక్కిన పేనులాగ పడి ఉండు అంటూ ఆడవాళ్ళమీద పెత్తనం చేసే రోజులు పోయాయమ్మా. నా పెళ్ళి నాకు ఇష్టమైన వాడితోనే నేను అనుకున్న రోజునే జరగాలి" అంది శ్రీల.

భార్యా భర్తా ఎంత ప్రయత్నించినా శ్రీల మనసు కరగలేదు.

రావు పెళ్ళివారింటికి వెళ్ళి "ఇప్పుడప్పుడే మా అమ్మాయి పెళ్ళి చేసుకోను అంటోందండి. దానికి ఎంబియ్యేలో సీటు వచ్చింది. అదైతేకానీ చేసుకోనని ఒకటే గొడవచేస్తోంది. మమ్మల్ని క్షమించండి" అని చేతులు పట్టుకుని క్షమార్పణ వేడుకున్నాడు.

పెళ్ళి ఆగిపోయి పదిరోజులేకాదు పది నెలలు గడిచినా శ్రీల తన ప్రేమ ఊసే ఎత్తలేదు. అది రావుని భార్యని చాలా ఆశ్చర్యపరిచింది.

ఓరోజు శ్రీల స్నేహితురాళ్ళొచ్చారు. అందరూ నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుకుంటున్నారు.

"'ప్రేమించు' చూసావా? 'నువ్వే కావాలి', 'ప్రేమతో రా', 'నువ్వు వస్తావని' వీటన్నింటిలో ఏది బాగుంది?' అని అడిగింది ఒకమ్మాయి.

అందరూ తలో చిత్రం పేరు చెప్పారు.

కాని శ్రీల ఏమీ మాట్లాడలేదు.

"నీకేది నచ్చిందే?"

"ఏదీ నచ్చలేదు!"

"ఎందుకు?"

"నాకు ప్రేమ సినిమాలంటే పరమ చిరాకు!" అంది శ్రీల.

ట్రేలో టిఫిన్ ప్లేట్లు పెట్టి తీసుకువస్తున్న శ్రీల తల్లి ఉలిక్కిపడి అక్కడే ఆగిపోయింది.

"చిరాకా? చిత్రంగా ఉందే నీ కామెంట్! ఆ సినిమాలు రిలీఫ్‌గా ఉంటాయి కదా!"

"రిలీఫా పాడా, కెరీర్ బిల్డ్ చేసుకోవలసిన కాలంలో ప్రేమ బిల్డప్ ఇవ్వడం చిరాకే కాదు రోతగా కూడ ఉంటుంది నాకు".

"మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాకే ప్రేమించి పెళ్ళాడాలి అంటావా?"

"కాదు కాదు! ప్రేమ గురించి ఆలోచించడమే టైమ్ వేస్ట్ అంటాన్నేను. ముందు కెరీర్ గురించి ప్లానింగ్, తర్వాత దానికోసం కష్టపడడం. ఆ తర్వాత మరింత మంచి అవకాశాలకోసం చూడడం చెయ్యాలి. ప్రేమ అనేది మనసులో చేర్తే అవన్నీ మూల పడ్తాయి. పెళ్ళి లైఫ్‌లో ఓ భాగం! అంతే కానీ అదే జీవితం కాదు అని అందరం గుర్తుంచుకోవాలి" అంది సీరియస్‌గా.

ఆ విషయం ఆ రాత్రి రావ్ చెవిలోవేసింది అతని భార్య.

"నీ ప్రేమ ఎంతదాకా వచ్చింది?" అని అడిగాడు మర్నాడే రావ్!

"సమయం వచ్చినప్పుడే నేనే చెప్తాను కదా నాన్నా" అంది శ్రీల.

"నా ఫ్రెండ్ వేణు ఫోన్ చేసాడోయ్! వాళ్ళబ్బాయి లండన్‌లో నెలకి లక్షరూపాయలు తెచ్చుకుంటున్నాడట. వచ్చేవారం వచ్చి పదిహేను రోజులు ఉంటాడుట. మంచి సంబంధం ఉంటే చెప్పమని అడిగాడు" అన్నాడు రావ్.

"ఆ అబ్బాయి చాలా బాగుంటాడు కూడా. మా చెల్లెలికి ఫోన్ చేసి చెప్తాను. వాళ్ళమ్మాయి కోసం కనుక్కుంటుంది" అంది శ్రీల తల్లి.

"వేణు అంకుల్ వాళ్ళది మన గోత్రమేనా నాన్నా" అడిగింది శ్రీల.

"కాదే! వాళ్ళది శ్రీవత్సస గోత్రమైతే మనది భారద్వాజసగోత్రం" అన్నాడు రావు.

"మరైతే నన్ను ఆఫర్ చేయవచ్చు కదా నాన్నా"

"అదేంటే నువ్వెవర్నో ప్రేమించావు కదా!" ఆశ్చర్యంగా అంది శ్రీల తల్లి.

"అలా చెప్తే కానీ పెళ్ళి ఆగిపోదని అబద్ధం చెప్పాను".

"అబద్ధం చెప్పావా? ఎందుకలా చేశావు?"

"నాకు బ్యాంకాఫీసర్ని చేసుకోవడం ఇష్టం లేదు".

"ఎందుకు?"

"అతనికి ఫ్యూచర్ ఏముంటుందమ్మా?"

"ప్రమోషన్లుంటాయి".

"ఆ ప్రమోషన్లు నాకు సరిపోవు. అయినా నాకు ఎబ్రాడ్‌లో ఉండి ఎంతో బాగా ఎర్న్ చేసే అబ్బాయిని చేసుకోవడం ఇష్టం! అక్కడ నాకు కూడా బాగా స్కోప్ ఉంటుంది. నా అభిప్రాయం ఇది అని మీకు తెలీదు. ఎవరో మంచి సంబంధం అబ్బాయి బాగుంటాడు అని చెప్పగానే టక్కున కుదిర్చేశారు. అయినా అందాన్ని కోరుక్కుతింటామా నాన్నా! ఆ మాట అప్పుడే చెప్పేదాన్ని! కానీ ఆ కారణం చెప్తే పెళ్ళి ఆగిపోయేది కాదు కదా!"

"అయితే ఏమంటావే?"

"వేణు అంకుల్ని వెంటనే కలవండి. ఆలస్యం చెయ్యకండి. ఎందుకంటే నాలాంటి అమ్మాయిలు చాలామందుంటారు" అంది.

ఆశ్చర్యంగా భార్యవైపు చూశాడు రావ్.

"కమాన్ డాడీ గెటప్" అంటూ తండ్రిని సోఫాలోంచి లేపి గబగబా ప్యాంటూ చొక్కా తెచ్చి చేతికిచ్చింది శ్రీల.

పెళ్ళిమాట చెప్తే చాలు తుర్రుమనెడి తను ఫలానా అబ్బాయినే చేసుకుంటానని చెప్తూ అతను తనకి ఎలా ఉపయోగపడ్తాడో కూడా వివరిస్తున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయింది శ్రీల తల్లి. ❀

## సెక్స్‌పోజింగ్

*బాలీవుడ్‌లోనూ, టాలీవుడ్‌లోనూ 'శిల్ప' కి మంచిపేరేవుంది. సెట్‌లో పోజు కొట్టదు, ఎటువంటి డ్రెస్ వేసుకోమన్నా వేసుకుంటుంది. కావల్సినంత ఎక్స్‌పోజింగ్ కుమ్మరిస్తుంది. పైగా ఈ వయసులో ఎక్స్‌పోజింగ్ చేయకపోతే ముసలి వయసులో చేస్తే ఎవరు చూస్తారు? అంటోంది సగర్వంగా.*

